AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
19-9-2025 (Friday)
MAIN EDITION

## భారీగా తగ్గిన పసిడి ధర



**అక్షరటుడే, హైదరాబాద్ :** బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,11,160కు చేరింది. శుక్రవారం నిన్నటి కంటే దాదాపు రూ.540 తగ్గింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,890గా ట్రేడ్ అయింది. మరోవైపు, వెండి ధరల్లో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. హైదరాబాద్ కేజీ వెండి రూ. 4,000 తగ్గి రూ.1,40,900కి చేరింది.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పార్టీ మారిన ఆరుగురు ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంప్ అయిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్, కాలె యాదయ్య, కృష్ణమోహన్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, మహిపాల్‌రెడ్డికి శుక్రవారం నోటీసులు పంపించారు. వీరితో పాటు బీఆర్ఎస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు మరిన్ని ఆధారాలు అందజేయాలని స్పష్టం చేశారు.

## 20న ఎంగిలిపూల బతుకమ్మ



**అక్షరటుడే, హైదరాబాద్:** తొలి బతుకమ్మ అయిన ఎంగిలిపూల బతుకమ్మను రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అమావాస్యకు ఒక్క రోజు ముందుగానే నిర్వహించనున్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. బతుకమ్మ వేడుకలు ఇక్కడ ముందుగానే ప్రారంభం అవుతాయని చెప్పారు.

## నేటినుంచి మరో ఐపీవో

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఐపీవోల సందడి కొనసాగుతోంది. రెన్యువబుల్ ఎనర్జీ సెక్టార్‌కు చెందిన సాత్విక్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ పబ్లిక్ ఇష్యూ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కంపెనీ రూ. 900 కోట్లను సమీకరించడం కోసం ఐపీవోకు వచ్చింది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ రూ. 700 కోట్లు కాగా.. మిగిలినవి ఆఫర్ ఫర్ సేల్ ద్వారా సమీకరించనుంది.





## అనారోగ్యంతో టాప్ కమెడీయన్ మృతి

**అక్షరటుడే, సినిమా డెస్క్ :** తమిళ సినీ ప్రేక్షకులను నవ్వించడంలో తనదైన గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ హాస్యనటుడు రోబో శంకర్ ఇక లేరన్న వార్త కోలివుడ్‌లో తీవ్ర విషాదం నింపింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు.



## టికెట్ కోసం పోటాపోటీ



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే డివిజన్ల వారీగా తమ బలాబలాలపై లెక్కలు వేసుకుంటున్నాయి. ఎలాగైనా గెలిచి పట్టు నిలుపుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తుండగా, సిట్టింగ్ సీటును కాపాడుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరోవైపు, జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడం ద్వారా హైదరాబాద్‌లో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. మూడు ప్రధాన పార్టీలు గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేస్తుండగా, అభ్యర్థుల ఎంపిక తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఆశావాహులు భారీగా ఉండడంతో కొత్త తలనొప్పి మొదలైంది. బీఆర్ఎస్‌లో అంతగా పోటీ లేకపోయినప్పటికీ, కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి జాబితా పెరుగుతోంది. దీంతో ప్రధాన పార్టీలకు అభ్యర్థుల ఎంపిక కత్తి మీద సాములాగే మారింది. —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- జూబ్లీహిల్స్‌పై ఆశావాహుల కన్ను
- పోటీ చేసేందుకు పలువురి ఆసక్తి
- ప్రధాన పార్టీల్లో తీవ్రమైన పోటీ
- అధికార పార్టీలో మరింత ఎక్కువ..
- టికెట్ కోసం జోరుగా ప్రయత్నాలు
- బీజేపీలోనూ అదే పరిస్థితి

జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. గోపినాథ్ అనారోగ్యంతో జూన్ 8న హఠాన్మరణం చెందారు. జూబ్లీహిల్స్ శాసనసభ స్థానం ఖాళీ కావడంతో ఆర్నెళ్లలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అంటే డిసెంబర్ లోపు ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ఖరారు చేసే పనిలో పడింది. మరోవైపు, ఉప ఎన్నికకు గడువు సమీపిస్తుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో హడావుడి మొదలైంది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడం ద్వారా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటొచ్చాని భావిస్తున్నాయి. జోరుగా సర్వేలు, సమీక్షలతో తమ బలాబలాలు తెలుసుకునే పనిలో పడ్డాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పలుమార్లు అంతర్గత సర్వేలు నిర్వహించాయి. మరోవైపు, బీజేపీ కూడా డివిజన్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ కేడర్‌ను సన్నద్ధం చేస్తోంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపొందడం ద్వారా ప్రభుత్వ పనితీరు బాగుందన్న సంకేతాలు ప్రజల్లోకి పంపించవచ్చన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పూర్తి స్థాయిలో సన్నాహాలు చేసుకుంటోంది. ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో ఇప్పటినుంచే సర్వశక్తులు ఒడ్డుతోంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం సాధించినట్లే జూబ్లీహిల్స్ స్థానాన్ని సైతం కైవసం చేసుకోవాలని యోచిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి గడ్డం వివేక్‌లను ఇన్‌ఛార్జీలుగా నియమించింది. అయితే, అధికార పార్టీలో టికెట్ కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. సీనియర్ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్ వంటి వారితో పాటు పలువురు నాయకులు సైతం పోటీలో ఉన్నారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి పోటీ నుంచి తప్పించింది. అయితే, అనర్హత వేటు తప్పదని భావిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా పోటీ చేసే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీసీల నుంచి నవీన్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

### బీఆర్ఎస్ నుంచి ఆమెకే..

సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సుజాతను బరిలోకి దింపనున్నట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల సూత్రప్రాయంగా వెల్లడించారు.

### బీజేపీలోనూ భారీగా ఆశావహులు..

ఇక గత గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో చతికిల పడింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించడం ద్వారా హైదరాబాద్‌లో తమకు తిరుగులేదని చాటుకోవడంతో పాటు జీహెచ్ఎంసీ ఎలక్షన్లకు కేడర్‌ను సన్నద్ధం చేయొచ్చని కాషాయ పార్టీ యోచిస్తోంది. అయితే, ఆశావహులు భారీగా ఉన్న తరుణంలో ఎవరికి టికెట్ ఇస్తుందన్న దానిపై అందరి దృష్టి నెలకొంది.

## తెలంగాణలోనూ ఓ ట్రంప్ ఉండేవారు..

**కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ సెటైర్లు**



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి ఆ దేశానికే తీవ్ర నష్టమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన సదస్సులో ప్రసంగించిన ఆయన.. టారిఫ్‌లపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై సుంకాలు విధించడాన్ని ఆయన తప్పుబట్టారు. మనస్సులో ఏది తోస్తే అది చేసే వారు ఎక్కువ రోజులు మనుగడ సాగించలేరన్నారు. తెలంగాణలోనూ ఒక ట్రంప్ ఉండేవారని కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. తనకు నచ్చినట్టు పాలన చేయడంతో ప్రజలు ఆయనను ఓడించారని గుర్తు చేశారు. ట్రంప్‌నకు కూడా ఒకరోజు ఇదే పరిస్థితి తప్పదని వ్యాఖ్యానించారు.

### మనకేం పెద్దగా నష్టం లేదు..

'ట్రంప్ తాను రాత్రి కలలో అనుకున్నది పగలు అమలు చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు పూటకో మాట మాట్లాడుతున్నారు. ట్రంప్ ఒకరోజు మోదీ నాకు మిత్రుడు అంటాడు. ఆ వెంటనే 50 శాతం టారిఫ్‌లు విధిస్తారు. మరో మూడేళ్లు మాత్రమే ట్రంప్ తనకు నచ్చింది చేయగలరు. ఆ తర్వాత ఆయన దిగిపోక తప్పదు. భారతీయులకు వీసాలు ఇవ్వకుంటే నష్టపోయేది అమెరికానే' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## జలదిగ్బంధంలోనే ఏడుపాయల ఆలయం



**అక్షరటుడే, మెదక్ :** మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల దుర్గా భవాని ఆలయం జల దిగ్బంధంలోనే ఉంది. ఆలయం ముందు నుంచి మంజీర ఉధృతంగా ప్రవహిస్తోంది. మంజీర ఏడుపాయలుగా వీడిపోయిన ప్రాంతంలో, పచ్చని అడవుల మధ్య ఉన్న దుర్గామాత అమ్మవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా వర్షాకాలంలో అమ్మవారి దర్శనంతో పాటు ప్రకృతి అందాలను తిలకించడానికి వచ్చి వెళ్తుంటారు. అయితే ఈ ఏడాది దాదాపుగా నెల రోజులకు పైగా ఆలయం మూసి ఉంది.

## వరుస లాభాలకు బ్రేకులు

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయంగా అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ యూఎస్‌తో ట్రేడ్ డీల్ విషయంలో అనిశ్చిత పరిస్థితులతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గరిష్టాల వద్ద అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో సూచీలలో మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. శుక్రవారం సెన్సెక్స్ 67 పాయింట్ల నష్టంతో ప్రారంభమై 32 పాయింట్లు పెరిగింది. అనంతరం లాభాల స్వీకరణతో ఇంట్రాడే గరిష్టాల నుంచి 493 పాయింట్లు కోల్పోయింది. చివరికి సెన్సెక్స్ 387 పాయింట్ల నష్టంతో 82,626 వద్ద, నిఫ్టీ 96 పాయింట్ల నష్టంతో 25,327 వద్ద ముగిశాయి.

## లిక్కర్ స్కాంలో సిట్ కస్టడీకి ఎంపీ



**అక్షరటుడే, అమరావతి :** సంచలనం సృష్టించిన ఏపీ లిక్కర్ స్కాం కేసులో దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. ఈ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కస్టడీకి తీసుకుంది. విజయవాడ ఏసీబీ కోర్టు రెండు రోజుల పాటు కస్టడీకి అనుమతించడంతో, శుక్రవారం ఉదయం ఆయనను రాజమండ్రి నుంచి విజయవాడకు తరలించారు. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డిని ఏ4గా గుర్తించిన సిట్ ఆయనను ఇటీవలే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## ప్రభుత్వంపై మరోసారి రాజగోపాల్‌రెడ్డి విమర్శలు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** కొంతకాలంగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సారి 'ఎక్స్' వేదికగా ఆయన ప్రభుత్వంపై పరోక్ష విమర్శలు చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులివ్వాలని రాజగోపాల్‌రెడ్డి సూచించారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి నిధులు ఇవ్వాలని కోరారు. చాలా మంది ఎమ్మెల్యేల అభిప్రాయం ఇదేనని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్న వాస్తవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.

## రష్యాలో మరోసారి భారీ భూకంపం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రష్యాలో మరోసారి భూకంపం సంభవించింది. కమ్చట్కా ప్రాంతంలోని తూర్పు తీరానికి సమీపంలో 7.8 తీవ్రతతో భూకంపం వచ్చింది. రష్యాలో ఇటీవల తరచూ భూకంపాలు చోటు చేసుకుంటుండటంతో అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కమ్చట్కా దీవుల్లో ఎక్కువగా భూమి కంపిస్తోంది. తాజాగా రిక్టర్ స్కేల్‌పై 7.8 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం వాటిని ఉపసంహరించుకున్నారు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 6:58 గంటలకు భూకంపం చోటుచేసుకుంది. భూకంప కేంద్రం 19.5 కిలోమీటర్ల లోతులో ఉంది. కాగా.. ఇండోనేషియాలోనూ 6.1 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు కథనాలు వచ్చాయి.



## భారత్‌లో ఐఫోన్ 17 సేల్స్ షురూ..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఆపిల్ లవర్స్ ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ఐఫోన్ 17 సిరీస్ విక్రయాలు భారత్‌లో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆపిల్ స్టోర్ల ముందు జనం బారులు తీరారు. ముంబైలోని బీకేసీ జియో సెంటర్‌లోని ఆపిల్ స్టోర్ వెలుపల తీవ్ర గందరగోళం నెలకొంది. ఉదయం నుంచే వందలాది మంది ఆపిల్ అభిమానులు స్టోర్ బయట బారులు తీరారు. చాలా మంది తాజా సిరీస్ 17 ఫోన్‌ను కొనుగోలు చేయడానికి గురువారం రాత్రి నుంచే లైన్‌లో వేచి ఉన్నారు. ఈ క్రమంలో అక్కడకు భారీగా తరలి వచ్చిన జనం మధ్య గొడవ జరిగింది. పొడవైన క్యూలో కొంతమంది వ్యక్తులు ఘర్షణ పడడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు, సెక్యూరిటీ పరిస్థితిని చక్కదిద్దారు.

## అరుంధతి తమిళ రీమేక్‌లో శ్రీలీల!



లేడీ సూపర్ స్టార్ అనుష్క శెట్టి కెరీర్‌లోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన అరుంధతి ఇప్పుడు తమిళంలో రీమేక్ కానుందని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, శ్యామ్ ప్రసాద్ రెడ్డి నిర్మాణంలో రూపొందగా భారీ విజయాన్ని సాధించింది. అనుష్క చేసిన 'జేజమ్మ' పాత్రకు ఎవ్వరినీ పోల్చలేమన్నంత స్థాయిలో ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. అయితే తాజాగా తమిళంలో ఈ సినిమాను రీమేక్ చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని మీడియా రిపోర్టులు చెబుతున్నాయి. ముఖ్యంగా జేజమ్మ పాత్రలో శ్రీలీలను తీసుకునే ఆలోచన జరుగుతోందనే వార్తలు వినిపిస్తున్నాయి. మోహన్ రాజా ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నట్టు సమాచారం. ఈ విషయమై సినీ అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే నెటిజన్లు మాత్రం దీనిపై మిశ్రమ స్పందనలు వ్యక్తం చేస్తున్నారు. అనుష్క తర్వాత ఆ పాత్రలో మరెవరినీ ఊహించలేం" అని ఒక వర్గం అంటుంటే శ్రీలీల డాన్స్ బాగుంటుంది కానీ అనుష్క స్థాయి యాక్టింగ్ చేయగలదా?" అనే సందేహాలు మరో వర్గం వ్యక్తం చేస్తున్నారు.

—అక్షరటుడే, సినిమా డెస్క్